క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. కమ్మజన సేవా సంఘం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామికి పల్లకిసేవ, గ్రామోత్సవం నిర్వహించారు.

క్రీడా సామగ్రి వితరణ



కొడవలూరు: మండలంలోని కొత్తవంగల్లు హైస్కూల్‌కు అదే గ్రామానికి చెందిన పాఠశాల రిటైర్డ్ హెచ్‌ఎం రాగిపాటి శ్రీహరి రూ.10 వేల విలువైన క్రీడా సామగ్రిని వితరణగా ఇచ్చారు. వీటిని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత చక్కా మనోహర్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు నంబూరి ప్రసాద్ చేతుల మీదుగా మంగళవారం విద్యార్థులకు అందజేశారు. అనంతరం పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి బదిలీపై వెళ్లిన అక్కిరెడ్డి, ఉపాధ్యాయులు సురేష్, భూపతి, భవానీలను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ హెచ్‌ఎం శ్రీహరి దాతృత్వాన్ని అందరూ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నేతలు మాలకొండయ్య, రఘురామయ్య, మాల్యాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో వీసీ

వెంకటాచలం: కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ పట్టణంలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో ప్రతిభ చూపిన బీఎస్‌యూ విద్యార్థులను వీసీ జీఎం సుందరవల్లి అభినందించారు. ఆ శిబిరానికి ఎంపికైన విద్యార్థులు తమ ప్రదర్శనలు, సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రతిభ చూపి మంగళవారం కాకుటూరులోని వర్సిటీకి వచ్చారు. ఈ సందర్భంగా వీసీ వారితో మాట్లాడి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ విద్య ప్రభాకర్, డాక్టర్ సునీత, విద్యార్థులు ఆఫ్రిన్, చామంతి, సాయికుమార్, రాముడు, జయంత్, అనిత, హదియ, నవ్య, ఉమేష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



శ్రీనివాసులు మృతదేహం

మనుబోలు: మోటార్‌సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మనుబోలు సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సైదాపురం మండలం చీకవోలు గ్రామానికి చెందిన రాపూరు శ్రీనివాసులు(46), ఖీరం సద్గురురెడ్డి బైక్‌పై బాకీ వసూలు నిమిత్తం మనుబోలుకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యారు. మనుబోలు నుంచి గూడూరు వైపు వెళ్లేందుకు హైవే దాటుతుండగా బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ వచ్చేలోపే తీవ్రంగా రక్తస్రావమైన రాపూరు శ్రీనివాసులు మృతిచెందగా సద్గురురెడ్డిని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవరత్నాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలను ప్రవేశపెట్టి ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, దీనివల్ల ఆయా కుటుంబాలకు రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరు చింతోపు, పాములవారిపాళెం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రసన్న మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్తున్న ఆయనకు స్థానిక నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల గురించి వివరించి, బుక్‌లెట్‌ను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో ఇప్పటి వరకు 81,283 గడపలకు తిరిగినట్లు చెప్పారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్నారన్నారు. ప్రధానంగా పింఛన్లు తీసుకొంటున్న వృద్ధులు ఆనంద భాష్పాలతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే నేరుగా వారి గడపలకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తోందని వెల్లడించారు. ఇందువల్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రెండో దఫా పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు, వైఎస్సార్‌సీపీ నేతలు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, దేవిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఉడతా వెంకటశేషయ్య, బీవీ రమణయ్య, లేబూరు వెంకురెడ్డి, ఈదూరు విజయ్‌కుమార్, మహేష్, రామచంద్రయ్య, శ్రీనివాసులు, జయచంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరాలి

- ఐటీడీఏ పీఓ రాణి



సిబ్బంది సేవలపై ఆరాతీస్తున్న ఐటీడీఏ పీఓ

ఇందుకూరుపేట : అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలని ఐటీడీఏ పీఓ డాక్టర్ రాణి అన్నారు. మండల కేంద్రంలోని ఇందుకూరుపేట గ్రామ సచివాలయాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. సచివాలయానికి వచ్చిన స్థానికులతో సిబ్బంది సేవలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. తొలుత స్థానిక గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాల సమీపాన ఉన్న గిరిజన కాలనీలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పిల్లలను నూరు శాతం బడిబాట పట్టించే కార్యక్రమం చేపడుతామని పీఓ పేర్కొన్నారు.

పక్కాగా 'జగనన్న సురక్ష'



సర్వే వివరాలను ఆరాతీస్తున్న చలపతిరావు



బుచ్చిరెడ్డిపాళెం: సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుధీర్

- డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు

కొడవలూరు: 'జగనన్న సురక్ష' కార్యక్రమం పక్కాగా జరగాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. కొడవలూరులో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష సర్వే కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. వంద శాతం మంది పేదలకు సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో అర్హులైన లబ్ధిదారుల్లో 99.50 శాతం మందికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని వెల్లడించారు. కొన్ని సాంకేతిక కారణాలతో అందని అరకొర లబ్ధిదారులకు కూడా పథకాలను అందించడమే లక్ష్యంగా సురక్ష కార్యక్రమం కొనసాగుతోందన్నారు. దీనికి తోడు జనన, మరణ, కుల, కుటుంబ తదితర 11 రకాల సర్టిఫికెట్‌లను కూడా ఉచితంగానే ఇంటి వద్దే అందించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, డీటీ గున్నం మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు జి.రాధాకృష్ణ, జి.జాలయ్య, వీఆర్వో జి.రఘురామ్, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరాటంకంగా..

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి నగర పంచాయతీతో పాటు మండలంలోని 13 పంచాయతీల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిరాటంకంగా జరుగుతోంది. ఇందులో భాగంగా బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో మండల స్థాయి అధికారులైన తహసీల్దార్ సుధీర్, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ శ్యామ్ మంగళవారం ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను ఆరా తీశారు. ప్రతి ఇంటికి వెళ్లి అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందకుంటే గుర్తించడంతో పాటు, ఉచితంగా అందించే 11 సేవల గురించి వివరించారు. కౌన్సిలర్ బిత్రగుంట ప్రమీలమ్మ పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం కావాలి



మాట్లాడుతున్న నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని ప్రజాప్రతినిధులు ఆయా వార్డుల్లోని ప్రజలతో మమేకం కావాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 2, 3 వార్డుల ప్రజలు, కౌన్సిలర్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించాలని కోరారు. పెద్ద సమస్యలు ఉంటే సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మరో తొమ్మిది నెలల్లో ఎన్నికలు ఉన్న కారణంగా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్మన్ షాహుల్, కౌన్సిలర్లు అందె ప్రత్యూష, చీర్ల ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, కోడూరు మధుసూదన్‌రెడ్డి, మోర్ల మురళీ, కావలి వెంకటేశ్వర్లు, విల్సన్, ప్రవల్లిక పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం వృద్ధి



విత్తనాలను అందజేస్తున్న కిరణ్‌రెడ్డి

మనుబోలు : పచ్చిరొట్ట విత్తనాలతో పొలాల్లో భూసారం పెరుగుతుందని అక్కంపేట మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కంపేట ఆర్బీకేలో రైతులకు 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలను ఆయన చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందజేయడమే కాకుండా పెట్టుబడి నిధి, పంటల సాగులో రైతులకు అవసరమైన శాస్త్ర సాంకేతిక సలహాలను అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ కళారాణి, వైఎస్సార్‌సీపీ నేతలు అంబటి శ్రీనివాసులురెడ్డి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మలపూడిలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న వేణుగోపాల్

మనుబోలు : మండలంలోని కొమ్మలపూడి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత, సర్పంచ్ బండెల వేణుగోపాల్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సహకారంతో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వేణుగోపాల్ పుట్టినరోజును పురస్కరించుకుని తనతో పాటు 30 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలను రక్తనిధి కన్వీనర్ అజయ్‌బాబు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన వ్యక్తి ఏడాదికి మూడు లేదా నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. మనం ఇచ్చే రక్తం ఆపదలో ఉన్న ఎందరినో బతికిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, గుంజి రమేష్, చెందులూరు శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి పవన్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో మంగళవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన రవితేజ పనినిమిత్తం బైక్‌పై సర్వేపల్లికి వస్తుండగా గొలగమూడి సమీపంలో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో రవితేజకు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పెళ్లకూరు కాలనీలో పరిసరాలను పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది


కోవూరు : సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని ఇనమడుగు పీహెచ్‌సీ యూనిట్ ఆఫీసర్ నాగరాజు తెలిపారు. మండలంలోని కోవూరు గ్రామ సచివాలయం–2 పరిధిలో మలేరియా నివారణ వారోత్సవాల్లో భాగంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సీజన్‌లో దోమలను నివారించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు మలేరియా వ్యాప్తి, నివారణ, దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ఇలియాజ్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



కొడవలూరు: మండలంలోని రామాపురం ప్రాథమికోన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల విద్యార్థులకు బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు షేక్.యస్దానిబాషా మాట్లాడుతూ ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు సొసైటీ ద్వారా విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్నామన్నారు. సేవా కార్యక్రమానికి సహకారం అందించిన తాళ్ల స్వామికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనసూయమ్మ, ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం షబ్బీర్, సొసైటీ సభ్యులు పఠాన్ రహమతుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న శివకుమార్

కోవూరు(విడవలూరు) : ప్రజలు హెచ్‌ఐవీ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్వాహకుడు శివకుమార్ తెలిపారు. మండలంలోని రామతీర్థం గ్రామ సచివాలయంలో మంగళవారం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులపై టీబీ వ్యాధి ప్రభావం ఉంటుందన్నారు. అందువల్ల ఆయా వ్యాధుల వారు జాగ్రత్తతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది భూషణం, సురేఖ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌పై ప్రత్యేక దృష్టి

- ఏడుగురు పిల్లలు పాఠశాలలో చేరిక



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారులు

కొడవలూరు : డ్రాపౌట్స్(బడి మానేసిన) పిల్లలు పాఠశాలల్లో చేరేలా సమగ్ర శిక్ష అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. మండలంలోని గుండాలమ్మపాళెం మజరా నీలగిరి సంఘం గిరిజన కాలనీలో డ్రాపౌట్స్ విద్యార్థులున్నారన్న సమాచారంపై సమగ్ర శిక్ష ఏఎంఓ జి.సుధీర్‌బాబు, సీఎంఓ కె.పెంచలయ్య మంగళవారం కాలనీని సందర్శించారు. ఇక్కడ ఏడుగురు విద్యార్థులు డ్రాపౌట్స్‌గా ఉన్నట్లు గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్చడం వల్ల ప్రభుత్వమే అన్ని వసతులు సమకూర్చడంతో పాటు అమ్మఒడి నగదు మంజూరు చేస్తోందని, విద్యార్థుల బంగారు భవితకు బాట వేస్తోందని చెప్పారు. కొడవలూరు హైస్కూల్ దూరమైనందున పిల్లలను పాఠశాల పంపడం కష్టంగా ఉంటోందని వారు అధికారులకు విన్నవించారు. దీనిపై సమగ్ర శిక్ష అధికారులు ప్రభుత్వం ద్వారా పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు ఆటో సదుపాయం కల్పించేందుకు అంగీకరించారు. దీంతో బుధవారం నుంచి ఆ ఏడుగురు పిల్లలను కొడవలూరు హైస్కూల్‌కు పంపేందుకు తల్లిదండ్రులు అంగీకరించారు. తొలుత కొడవలూరు హైస్కూల్‌లో జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశానికి వారు హాజరై పలు సూచనలు చేయడంతో పాటు మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ రమాదేవి, ఎంఈఓ జి.వసంతకుమారి, ఎంఈఓ–2 ఎస్.అంకయ్య, హెచ్‌ఎం పి.మంజువాణి, సీఆర్పీలు ఎం.దయాకర్, జె.పెంచలరావు, టి.వెంకటసురేష్ ఉన్నారు.

పేద విద్యార్థులకు విద్యాకానుక వరం



విద్యాకానుక కిట్‌ను అందజేస్తున్న ఉపాధ్యాయులు

ముత్తుకూరు : పేద విద్యార్థులకు జగనన్న విద్యాకానుక వరం అని వైఎస్సార్‌సీపీ నేతలు కొనియాడారు. మండలంలోని మామిడిపూడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్‌లు, రాగి జావను మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ కాకి మస్తానమ్మ, నాయకులు పెమ్మారెడ్డి పద్మనాభరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ కృష్ణవేణి హాజరై, కానుకలను అందించారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఎం కోటేశ్వరావు, నేతలు గౌస్‌బాష, కోలాటం రామారావు, పసుపులేటి ప్రసాద్ పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో ప్రవేశాల వెల్లువ



సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్‌లో చేరిన విద్యార్థులు

ముత్తుకూరు : ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, ఇస్తున్న ప్రోత్సాహాలతో సర్కారు పాఠశాలల్లో కొత్తగా చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. మండలంలోని సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్‌లో మంగళవారం ఒకటో తరగతిలో కొత్తగా 15 మంది విద్యార్థులు చేరగా, 2, మూడో తరగతుల్లో ముగ్గురు విద్యార్థులు చేరారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శుభరత్నమ్మ విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. ఉపాధ్యాయులు రమ, జనార్దన్, పద్మారత్నం, అహ్మద్, సాయికుమార్, యేసయ్యలు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



తోటపల్లిగూడూరు : చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం



పొదలకూరు : మాట్లాడుతున్న హెచ్‌ఎం



మనుబోలు : మాట్లాడుతున్న ఎంఈఓ శేషాద్రివాసు

పొదలకూరు : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగుపడినట్లు ఇన్‌చార్జి ఎంఈఓ మధుసూదన్ తెలిపారు. స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పిల్లల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించగా ఎంఈఓ హాజరై, మాట్లాడారు. మనబడి నాడు–నేడులో ప్రభుత్వం పాఠశాలల రూపురేఖలు మారినట్లు తెలిపారు. నాణ్యమైన విద్యాబోధన ఉందని, అమ్మఒడి లాంటి పథకాలతో పేదలను ఆదుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం అవసరమని, మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాల్సిందిగా కోరారు. హెచ్‌ఎం కె.సనత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విద్యా కార్యక్రమాలను తల్లిదండ్రులకు చెప్పాలనే ఉద్దేశంతో సమావేశాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు.


నాణ్యమైన విద్య అందుతోంది

తోటపల్లిగూడూరు : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సాయిప్రసాద్ తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో చిన్నారుల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడా లేనివిధంగా విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్లు వెల్లడించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.2 వేల విలువ చేసే జగనన్న విద్యాకానుక కిట్లను అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు విధిగా తమ పిల్లలను చదివించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస ప్రసాద్, మోహన్, ఫణికుమార్, చంద్రమౌళి, రమణ, ప్రసాద్, పద్మజ, సులోచన, విద్యాధరి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

మనుబోలు : రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంఈఓ శేషాద్రివాసు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చిన్నారుల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. జగనన్న విద్యాకానుక పేరుతో విద్యార్థులకు అవసరమైన యూనిఫాం, బూట్లు, పుస్తకాలు, బ్యాగు తదితరాలను అందజేస్తోందన్నారు. ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పేరెంట్స్ కమిటీ కో–ఆప్షన్ మెంబర్ అనమాల ప్రభాకర్‌రెడ్డి, చైర్‌పర్సన్ సునీత తదితరులు పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి పడిన యువకుడు మృతి



మృతుడు సుబ్రహ్మణ్యం

పొదలకూరు : ఇంటి మిద్దెపై నుంచి కింద పడి గాయాలపాలైన పట్టణంలోని ఎమ్మార్వో కాలనీకి చెందిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి బుజ్జయ్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై కరిముల్లా కేసు నమోదు చేశారు. ఎస్సై కథనం మేరకు.. ఎమ్మార్వో కాలనీలో నివాసం ఉంటున్న జ్యోతి సుబ్రహ్మణ్యం(28) సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈనెల 24వ తేదీ రాత్రి ఇంటి మిద్దెపై నిద్రపోయాడు. మిద్దెకు పిట్టగోడ లేకపోవడంతో సుబ్రహ్మణ్యం దొర్లి కింద పడిపోయాడు. ఈ క్రమంలో తలకు గాయమవడంతో కుటుంబ సభ్యులు ముందుగా పొదలకూరు సీహెచ్‌సీలో చికిత్స చేయించి నెల్లూరు జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడి నుంచి తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

సరస్వతీదేవి అలంకారంలో కుంకాళమ్మ

ఇందుకూరుపేట : మండలంలోని లేబూరు గ్రామంలో ఉన్న కుంకాళమ్మ ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామవీధుల్లో ఊరేగుతున్న అమ్మవారికి కొబ్బరికాయ, కర్పూర హారతులతో భక్తులు స్వాగతం పలికారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసులుశర్మ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.